జాతీయ ట్రాక్ సైక్లింగ్‌కు జిల్లా సైక్లిస్టుల ఎంపిక

సైక్లింగ్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న సిటిజన్ క్లబ్ కార్యదర్శి, సభ్యులు

సిద్దిపేట, నవంబర్ 12 : ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో జరిగే జాతీయస్థాయి ట్రాక్ సైకిల్ సైక్లింగ్ పోటీలకు జిల్లా నుంచి పలువురు సైక్లిస్టులు ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకట నర్సయ్య తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ హైదరాబాద్ సైక్లింగ్ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ట్రాక్ సైకిల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సిద్దిపేటలోని ఖేలో ఇండియా సైకిలింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న డి. వర్షిత, రిజ్వానా బేగం, కె.హర్షిత, సిహెచ్. సాయికుమార్, జి అభిషేయ్ రెడ్డి ఎంపికయ్యారు. వీరితో పాటుగా హుస్నాబాద్‌కు చెందిన సురంపల్లి సుమిట్, అమిత్, ఐలేని వరుణ్ రెడ్డి ఎంపికయ్యరన్నారు. ట్రాక్ క్రీడా అనేది అత్యంత వేగంతో కూడుకున్న క్రీడ అని సిద్దిపేట నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. సిద్దిపేట సిటిజన్స్ క్లబ్ సభ్యులు ప్రోత్సాహకరంగా స్పోర్ట్స్ కిట్స్, రవాణా ఖర్చులకు రూ. 30 వేలు అందజేశారు. సిద్దిపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, ఖేలో ఇండియా వ్యవస్థాపక సభ్యులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకట నరసయ్య, కోచ్ సంజీవ్, సిటిజన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీబోనాల నరసింహులు, నాయి నర్సింహారెడ్డి, గుడాల సురేశ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మార్క రామదాస్ గౌడ్, సిటిజన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అనుకూలంగా జాతీయ రహదారి

■ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ■ సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ, పక్కన కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, నవబర్ 12: జాతీయ రహదారి రైతులకు ఇబ్బంది కలుగకుండా, అనూకులంగా ఉండే విధంగా అధికారులు పర్యవేక్షించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి, ఎంపీ రఘునందన్‌రావు నేషనల్ హైవే అధికారులతో కలిసి నూతన ప్రతిపాదిట సూర్యపేట సిరిసిల్ల జాతీయ రహదారి 365 బి వలన ప్రభావిత మవుతున్న సిద్దిపేట సమీపంలో మర్పడగ , పరిసర 7 గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు ప్రతిపాదిత రహదారి మ్యాప్‌ను రహదారి నిర్మాణ డీపీఆర్‌ను ఎజెన్సీ ప్రతినిధి మురళి ప్రొజెక్టర్ ద్వారా చూపించి వివరించారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దుద్దెడ నుంచి రామంచ వరకు గ్రామాల మీదుగా వెళ్తున్న ప్రతిపాదిత రోడ్డు పై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నందున 3 ప్రత్యామ్నాయ రహదారులను ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, నేషనల హైవే ఈఈ బలరామ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ దవాఖానను సందర్శించిన కలెక్టర్

హుస్నాబాద్, నవంబర్ 12 : హుస్నాబాద్ లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలోని వార్డులు తిరిగి రోగులతో మాట్లాడారు. దవాఖానను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

హైడ్రా పేరిట కాలయాపన..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు

కొమురవెల్లి, నవంబర్ 12 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరిట కాలయాపన చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. మంగళవారం కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.కృష్ణా రెడ్డి, అత్తిని శారద, తాడూరి రవీందర్ అధ్యక్షతన సీపీఎం 3వ మహాసభ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు సభ్యుడు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ బుల్డోజర్ వ్యవస్థను అమలు చేసినట్లే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరిట పేదలను రోడ్ల మీదకు నెట్టివేశారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, చక్రపాణి, బాలస్వామి, భరత్ పాల్గొన్నారు.

సమావేశం మాట్లాడుతున్న చుక్క రాములు

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

చేర్యాల, నవంబర్ 12 : వికారాబాద్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులపై కొండగల్‌లో నియోజకవర్గం లగచర్లలో జరిగిన దాడిని ఖండిస్తూ చేర్యాల తహసీల్ ఎదుట కార్యాలయ అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, నవంబర్ 12 : వికారాబాద్ జిల్లాలో ఫార్మా కంపెనీ భూసేకరణ విషయమై ప్రజాభిప్రాయసేకరణకు వెళ్లిన కలెక్టర్ ఇతర రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు రెవెన్యూ ఉద్యోగులు తెలిపారు. మంగళవారం దాడిని నిరసిస్తూ సిద్దిపేట ఆర్డీవో, అర్బన్ తహసీల్ రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలను ధరించి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీమ్ ఉన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

సిద్దిపేట టౌన్, నవంబర్ 12 : పోలీస్ శాఖలో ఉన్నత ఉద్యోగం వదిలి ప్రజలకు సేవ చేసేందకు వస్తున్నానని మాజీ డీఎస్పీ మదనం గంగాధర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నానని తెలిపారు. పోలీస్ శాఖలో ఉన్నత స్థాయికి ఎదిగానని 26 ఏండ్లు వివిధ హోదాల్లో పనిచేశానన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మదనం గంగాధర్

'మల్లన్న' ఆలయంలో దీపాలంకరణ

చేర్యాల, నవంబర్ 12 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయంలో కార్తికమాసం 11వ రోజు ఏకాదశి పురస్కరించుకుని ఆలయ అర్చకులు మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మృత్యుంజయ అక్షరమాల స్తోత్ర పారాయణం నిర్వహించి దీపోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 12 : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని అన్ని గ్రామాల్లో కొనసాగుతుంది. మంగళవారం మద్దూరు మండలంలోని రేబర్తి, వల్లంపట్ల గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేనే ఎంపీడీవో రామ్మోహన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాల్లో సూపర్‌వైజర్లు, ఎమ్యూనరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు మాదవ్ జాదవ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన గజ్వేల్ ఆర్డీవో

మర్కూక్, నవంబర్ 12 : సమగ్ర కుటుంబ కులగణన సర్వేపై సందేహాలు, అపోహలు అవసరం లేదని, ప్రజలు సర్వే ప్రక్రియలో భాగస్వాములపై తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ సూచించారు. మండలంలోని గంగాపూర్ లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును మర్కూక్ తహసీల్దార్ అరీఫాతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్జాలొద్దీన్, సిబ్బం ది పాల్గొన్నారు

వల్లంపట్లలో ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

బూరుగుపల్లిలో చిరుతపులి కలకలం

గాలింపు చర్యలు చేపట్టిన అటవీశాఖ అధికారులు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 12 : సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లిలో చిరుతపులితోపాటు పులిపిల్లలు సంచరిస్తున్నాయనే విషయం కలకలం రేపింది. గత వారం పది రోజులుగా తమకు రెండు పులిపిల్లలు కనిస్తున్నాయని గ్రామానికి చెందిన రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటి నుంచి అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి కూడా పొలం వద్దకు వెళ్తున్న రైతులకు పులి కనిపించడంతో అటవీశాఖ అధికారులకు తెలిపారు. రైతులు ఇచ్చిన సమాచారంతో ఈ ప్రాంతంలో బోన్లు కూడాఏర్పాటు చేశామని, అటవీశాఖ అధికారిపద్మ తెలిపారు. పొలాలకు వెళ్లే రైతులు ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు.

రైతులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

మున్సిపల్ అధికారులతో కమిషనర్ సమీక్ష

సిద్దిపేట, నవంబర్ 12 : పట్టణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ పట్టణంలో ఎక్కడ అపరిశుభ్రత ఉండకుండా చూసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉదయాన్నే పారిశుధ్య కార్మికుల హాజరు తీసుకోగానే వెంటనే వార్డుల్లో పర్యటించాలన్నారు. ఎవరైనా బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేసినట్లయితే సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మందపల్లి, లింగారెడ్డి పల్లి, 6 వార్డు, స్వచ్ఛబడిలో ఇంట్లో నుంచి వెలుపడే తడి చెత్త ద్వారా తయారవుతున్నటువంటి సేంద్రియ ఎరువు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, తయారవుతున్నటువంటి సేంద్రియ ఎరువును రైతులకు, మొక్కలను పెంచే గృహ యజమానులకు విక్రయించాలని వాటిని సేంద్రియ ఎరువు కేంద్రాల్లో ఉన్నటువంటి రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. వ్యాపారస్తుల సైతం ట్రేడ్ లైసెన్స్ తీసుకొని వ్యాపారాలను నిర్వహించాలన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సీజ్ చేసిన వాహనాలు అప్పగించాలి

గజ్వేల్, నవంబర్ 12 : వాహనాల తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాలను సంబంధిత వాహన యజమానులకు అప్పగించాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. మంగళవారం గజ్వేల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వంగా ఉండాలని, ప్రతి రోజు వచ్చే ఫిర్యాదులపై సీఐలు తప్పకుండా వారితో మాట్లాడి సమస్యను పరిష్కారించాలన్నారు. వీపీవో వ్యవస్థను మెరుగుపర్చాలని వారంలో రెండు, మూడుసార్లు గ్రామాన్ని సందర్శించాలని పోలీసులకు సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూసుకోవాలని, కేడీలు, బీసీలు, అనుమానిత రౌడీలపై నిఘా పెట్టాలన్నారు. సీఐలు సైదా, ముత్యంరాజు, ఎస్సైలు యాదవరెడ్డి, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్12 : వికారాబాద్ జిల్లా బొమ్మరసిపేట మండలం లాగ్‌చెర్ల గ్రామాల్లో కలెక్టర్ నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య అని పలువురు ఖండించారు. చఫార్మా విలేజీకి సంబంధించిన ల్యాండ్ విషయంలో గ్రామ ప్రజలకు అధికారులకు జరిగిన సమావేశంలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిని సిద్దిపేట టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ తీవ్రంగా ఖండిస్తూ, మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులతో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించారు. సభ్యులు, పాల్గొన్నారు.

గ్రూప్-3ను ప్రశాంతంగా నిర్వహించాలి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 12 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 3 పరీక్షను అభ్యర్థులు ప్రశాంతమైన వాతావరణంలో రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 3 పరీక్ష నిర్వహణకు ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

హమాలీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

బెజ్జంకి, నవంబర్ 12 : కేంద్ర ప్రభుత్వం హమాలీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని గుండారంలో సీపీఎం గ్రామశాఖ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మల్లేశం, సంపత్, కొంరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయ ప్రాజెక్ట్‌లో చేపపిల్లలు విడుదల

కోహెడ నవంబర్ 12 : మండలంలోని సింగరాయ ప్రాజెక్ట్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి గ్రామ ముదిరాజు మంగళవారం చేపపిల్లలను వదిలారు. అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డిని ముదిరాజు సంఘ సభ్యులు సన్మానించారు. జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కనుకయ్య పాల్గొన్నారు.

డివిజన్ రాకుండా కాంగ్రెస్ జేఏసీ కుట్ర

చేర్యాల, నవంబర్ 12 : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అధికార పార్టీ జాక్ పని చేస్తున్నదని, జీవోలు తీసుకురాకుండా చేర్యాల ప్రాంత ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ముసుగులో ఉన్న జేఏసీని నమ్మవద్దని చేర్యాల రెవెన్యూ డివిజన్ జాక్ చైర్మన్ చక్రదారి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు పార్టీలు మారిన వ్యక్తి, కుటుంబ సభ్యులను కనీసం కౌన్సిలర్ గెలిపించుకోలేని వ్యక్తి ఆధ్వర్యంలో కొనసాగు ఉద్యమాన్ని ప్రజలు విశ్వసించరన్నారు. అధికారంలో ఉన్న వారు జేఏసీ పెట్టి ఉద్యమాలు నిర్మించే కంటే చిత్తశుద్ధి ఉంటే డివిజన్ ఏర్పా టు జీవో తీసుకురావచ్చనని తెలిపారు. వెంటనే నాయకులు బయటకు రావాలని పిలుపునిచ్చారు.

మలేషియా దీపావళి ఉత్సవాల్లో దప్పు దరువు

మిరుదొడ్డి, నవంబర్ 12 : మలేషియా ప్రభుత్వం నిర్వహించిన దీపావళి ఫెస్టివెల్ వేడుకల్లో తెలంగాణ మట్టి కళారూపం దప్పు దరువు కళా ప్రదర్శనలను మిరుదొడ్డి మండలంలోని అందె భాస్కర్ కళా బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా దప్పు దరువు కళా ప్రదర్శనలను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ తిలకించి అందె భాస్కర్ బృందం కళా కారులను అభినందించారు.

మలేషియాలో అందె భాస్కర్ బృందాన్ని అభినందిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యాబోధన జరగాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లను ప్రారంభిస్తున్న మంత్రి

హుస్నాబాద్, నవంబర్ 12 : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పాఠశాలల్లో విద్యాబోధన జరగాల్సి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో కంప్యూటర్, సైన్స్, రోబోటిక్, ఇంగ్లిష్ ల్యాబ్‌లను కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యపట్ల ఆసక్తిని పెంచుకునేందుకే వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో హుస్నాబాద్ పాఠశాలలో ఆధునిక ల్యాబ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. త్వరలో సిద్దిపేటలో జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఈ నెల 14వ తేదీ నుంచి హుస్నాబాద్ మినీ స్టేడియంలో ఉచిత యోగా కేంద్రం ప్రారంభమవుతుందని, పట్టణ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు మంచి భవిష్యత్తు : కలెక్టర్

పాఠశాలల్లో రోబోటిక్, సైన్స్, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నిర్మాన్ సంస్థ ప్రతినిధి ఉషకర్, ఇన్ఫినిటీ వైద్య ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణారెడ్డి, సోహం అకాడమీ ప్రతినిధులు ఉన్నారు.

క్యాంప్ కార్యాలయంలో మంత్రి పూజలు

హుస్నాబాద్, నవంబర్ 12: ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట, కరీంనగర్ జిల్లా కలెక్టర్లు మనుచౌదరి, పమేలా సత్పతి, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఇండస్ట్రియల్ పార్కు వద్దంటూ మంత్రికి వినతి

హుస్నాబాద్, నవంబర్ 12: అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ శివారులో ఇండస్ట్రియల్ పార్కు వద్దే వద్దంటూ గ్రామస్తులు, రైతులు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరికి విన్నవించారు. రైతులు జంపయ్య, వెంకటయ్య, రంగారావు, రమేశ్, ఎల్లయ్య, దేవమ్మ, బాలవ్వ, రాజేందర్, యాదగిరి, భూమయ్య ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'దేశిని' విగ్రహం ఏర్పాటు చేయాలి

హుస్నాబాద్, నవంబర్ 12 : ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన దేశిని చినమల్లయ్య విగ్రహాన్ని హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరుతూ కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కన్నోజు చొక్కాచారి, పట్టణ కల్లుగీత కార్మిక సొసైటీ డైరెక్టర్ ఇల్లందుల తిరుపతి, నాయకులు ఉన్నారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

రేబర్తిలో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 12 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మద్దూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామ్మోహన్ అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగకుండా చూడాలన్నారు. కాంటా అయిన ధాన్యాన్ని వెంటవెంటనే లారీల ద్వారా పంపించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, రైతులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చెక్కులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 12 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె గ్రామ బాధితులకు మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వడ్డె సంపంగి మల్లేశానికి రూ.60 వేలు, చాకలి లచ్చవ్వకు రూ. 24 వేలు, సిద్రమైన కర్ణాకర్‌కు రూ.17, 500, మరుపల్లి రాజు గౌడ్‌కు రూ.12 వేలు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నాయకులు రాజేశ్వర్, రవి, చంద్రం, బాల్‌నర్సాగౌడ్, రామస్వామి, నరేశ్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నర్సింహారెడ్డి, రమేశ్, రాములు, రాజు ఉన్నారు.

నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి

గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న ఆర్డీవో చంద్రకళ

గజ్వేల్, నవంబర్ 12 : ప్రజలకు సేవలందించే లక్ష్యంతో పనిచేస్తున్న కలెక్టర్, ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ సిబ్బందిపై లగచర్లలో జరిగిన సంఘటనలో దాడికి పాల్పడిన నిందితులను గుర్తించి వెంటనే శిక్షించాలని టీఎన్జీవో గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు లింగం డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ ఐవోసీలోని ఉద్యోగులు విధులు బహిష్కరించి నల్లా బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, భూసేకరణ విషయంలో నిర్వహించే గ్రామసభకు వెళ్లిన అధికారులపై దాడికి పాల్పడడం తగదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ శ్రవణ్, టీఎన్జీవో సంఘం నాయకులు రాజశేఖర్‌రెడ్డి, భరత్, బిలాల్, శ్రవణ్, కృష్ణ, శ్రీధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిద్దిపేట టౌన్, నవంబర్ 12 : అక్రమంగా ఇంట్లో దాచిపెట్టిన రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట వన్‌టౌన్ ఎస్సై కనకయ్య గౌడ్ వివరాల ప్రకారం.. పట్టణంలోని భారత్‌నగర్‌లో ఓ ఇంట్లో రాజిరెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి తనిఖీ నిర్వహించి 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని రాజిరెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

చేర్యాల, నవంబర్ 12 : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కారు టైంపాస్ పాలన కొనసాగిస్తున్నదని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో ఆరోపించారు. ఈ నెల 16న చేర్యాలలో జరిగే సీపీఎం మండల మహాసభకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం మండలంలోని చుంచనకోట గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ